నేలకొరిగిన భారీ వృక్షం



బాలాజీనగర్ డివిజన్‌లో మంగళవారం కురిసిన భారీ వర్షానికి వృక్షం నేలకొరిగింది. బాలాజీనగర్ డివిజన్‌లోని సాయిబాబా ఆలయం రోడ్డులోని భారీ వృక్షం కూలిపోవటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. - కూకట్‌పల్లి

మల్కాజిగిరి ప్రగతికి నిరంతరం కృషి చేస్తా..



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైష్ణవీ ప్రసాద్

నాగోలు: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర ఎంపీ అభ్యర్థి పెండ్యాల శేషసాయి వర ప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. బుధవారం ఆయన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, బాలానగర్, రాజు కాలనీ, కీసర, మేడ్చల్, కంటోన్మెంట్‌ల్లోని వివిధ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తాను మల్కాజిగి ఎంపీగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ఎంపీగా తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి ఇంటి సంక్షేమం, పేదల కోసం, ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. పార్లమెంట్ పరిధిలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడంతో పాటు యువకుల కోసం నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. మహిళల అభివృద్ధి, భద్రత, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజవర్గంలో తాను చేపట్టిన పలు సేవ కార్యక్రమాలను కాలనీ వాసులకు వివరించారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రతి అంశానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మల్కాజ్‌గిరిలో ఈటల గెలుపు ఖాయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు



ఫిరోజ్‌గూడలోని కాలనీల్లో ప్రచారం చేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్యకర్తలు

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడలో మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఫిరోజ్‌గూడలోని అన్ని కాలనీల్లో వెళ్లి ఓటర్లను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ... మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో ఈటల రాజేందర్‌కు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఈ స్పందనను చూసి ఓర్వలేకనే ఈటల రాజేందర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా మల్కాజ్‌గిరిలో ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని అన్నారు. బ్యాలట్ పేపర్‌లో 2వ నంబర్‌పై ఉన్న కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం టీం-8 ట్రస్ట్ ఫతేనగర్ ఆధ్వర్యంలో ఫిరోజ్‌గూడ శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్ కోసం బీజేపీకి ఓటేద్దాం..

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కేఎస్‌నగర్, రాణాప్రతాప్‌నగర్, వాసవీ కల్యాణ మండపంలో మేడ్చల్ జిల్లా సెక్రటరీ పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. దేశ ప్రగతిని చూసి ప్రజలంతా బీజేపీకి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. బంగారు భవిష్యత్ కోసం బీజేపీకి ఓటేద్దామని ఓటర్లతో అన్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని ఈటల రాజేందర్‌కు మంచి స్పందన ఉందని తెలిపారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సునీత్ జాదవ్, కృష్ణంరాజు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను గెలిపించాలి..

మూసాపేట: మూసాపేట డివిజన్‌లోని జనతానగర్‌లో బుధవారం డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసారి మల్కాజ్‌గిరిలో ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు మన్నే యాదగిరి, టి.నవీన్‌కుమార్, ఓబీసీ నాయకులు కిషోర్ కుమార్, దోమల శ్రీనివాస్, ప్రదీప్ పాల్గొన్నారు.



జనతానగర్‌లో ప్రచారం చేస్తున్న పిట్ల మనోహర్, నాయకులు



అల్లాపూర్ డివిజన్ ప్రచారంలో పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

అయోధ్య రామాలయం, అక్షింతలపై
అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

- విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు
- సీఎం రేవంత్‌రెడ్డి, అద్దంకి దయాకర్ దిష్టిబొమ్మల దహనం



వై జంక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, దయాకర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న దృశ్యం

మూసాపేట: అయోధ్య రామాలయంపై, అక్షింతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తీవ్రంగా ఖండించారు. రామ మందిరంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీతారాముడిపై కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలను సైతం ఖండిస్తున్నామని అన్నారు. దీనికి నిరసనగా కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద బుధవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్‌రెడ్డి, అద్దంకి దయాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు దిష్టిబొమ్మను దహనం చేయొద్దని పోలీసులు అడ్డుకోవటంతో తోపులాట జరిగింది. పోలీసులు వారిని బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ నిరసనలో బజరంగ్‌దళ్ రాష్ట్ర కో కన్వీనర్ జీవన్, విశ్వకర్మ జిల్లా సాహస యోజక్ హరి, బాలాజీ, కోశాధికారి ప్రభాత్ ఠాగూర్, ప్రతినిధులు ఉదయ్, అభినవ్, భాను, దుర్గాప్రసాద్, కిరణ్, రాహుల్, విశాల్, దేవిప్రసాద్, నగేష్, విజయ్ పాల్గొన్నారు.





విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

క్యాచ్‌పిట్‌లను తెరిచి.. వర్షపునీరు వెళ్లేట్టు చేసి.!

జీహెచ్‌ఎంసీ అధికారుల ముందస్తు జాగ్రత్త చర్యలు



మూసాపేట మెట్రో స్టేషన్‌వద్ద క్యాచ్‌పిట్‌లను తెరిచిన అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జీహెచ్‌ఎంసీ అధికారులు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ముందస్తు చర్యలు చేపట్టారు. మూసాపేట మెట్రోస్టేషన్ వద్ద జాతీయ రహదారిపై నీరు నిలిచిపోయింది. గతంలో మెట్రో రైలు పనులు జరుగుతున్న సమయంలో స్మార్ట్ వాటర్ డ్రెయిన్ సిస్టమ్ దెబ్బతింది. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు సమస్యను గుర్తించి అదనపు క్యాచ్‌పిట్‌లను తెరిచి, ఉన్న పైపులను శుభ్రం చేశారు. దీంతో పైపుల అమరికను గుర్తించి, పైపులను డిసిల్టింగ్ చేయటానికి వర్షాకాల సమయంలో ఎక్కువ నీటిని తరలించటానికి క్యాచ్‌పిట్‌లను తెరిచారు. దీంతో భారీగా కురిసిన వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా వెంటనే పైపులైన్‌ల ద్వారా తరలిపోవటంతో వాహనదారుల ప్రయాణం సులభతరమైందని అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగంలో యూజీ, పీజీ కోర్సులు, పార్ట్‌టైమ్ పీజీ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలను కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మనూ' హిందీ విభాగం హెడ్ డాక్టర్ జీవి రత్నాకర్ తెలిపారు. 'మనూ' హిందీయేతర ప్రాంతాల్లో హిందీ భాష, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. హిందీ, ఉర్దూ, దఖినీ భాషలు, సంస్కృతిలో అధ్యయనాలు, పరిశోధనల ఇంటర్ డిసిప్లినరీ విధానాలపై డిపార్ట్‌మెంట్ దృష్టి పెట్టిందన్నారు. హిందీ విభాగం తన పాఠ్యాంశాల ద్వారా సాహిత్యంతోపాటు ఫంక్షనల్ హిందీ, ఇతర అనువాద సంబంధిత కోర్సులను అందించడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు. మెరిట్ ఆధారిత కోర్సు ఎంఏ హిందీలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి జూన్ 30 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7013507228(డాక్టర్ జీవీ రత్నాకర్)ను సంప్రదించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ భక్తులతో కలసి హోమం పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి అమావాస్యకు అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని సత్యనారాయణ తెలిపారు. ఈ పూజలో వైస్ చైర్మన్ రమేష్, ఉపాధ్యక్షుడు మక్కాల నర్సింగ్‌రావు, కార్యదర్శి నిమ్మకాయల నర్సింగ్, దండుగుల నర్సింగ్‌రావు, మక్కాల అండల్, స్వరూప, బీఆర్‌ఎస్ నాయకులు మట్టి శ్రీను, బల్‌రాజు, రాజుగౌడ్, నాగేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి



మహాత్మాగాంధీనగర్ కాలనీవాసులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మహాత్మాగాంధీనగర్ వాసులు మద్దతు తెలిపారు. బుధవారం కాలనీవాసులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి పూర్తి మద్దతు తెలపడం గొప్ప విషయమన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాసానిని అఖండ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డికి మద్దతుగా జోరుగా ప్రచారం



ఆల్విన్‌కాలనీ ఫేజ్-1లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా బుధవారం ఆల్విన్‌కాలనీ ఫేజ్-1లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రచారం చేశారు. కాలనీవాసులను ఆప్యాయంగా పలకరిస్తూ హస్తం గుర్తుకే ఓటు వేయాలని కోరారు. యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, శివరాజ్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, నరసింగరావు, సీహెచ్.భాస్కర్, ప్రదీప్‌రెడ్డి, యాదగిరి, సంతోష్ బిరాదర్, రఘు పాల్గొన్నారు.

మాదాపూర్ సీసీఆర్టీలో సమ్మర్ క్యాంప్

21 నుంచి 31 వరకు నిర్వహణ

మాదాపూర్: చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెనింగ్) లో ఇంద్రధనస్సు పేరిట సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. పోటరీ, క్లే మోడలింగ్, టై అండ్ డై, అప్లిక్ ఆర్ట్, పేపర్ క్రాఫ్ట్, థియేటర్ ఆర్ట్స్, ఫోక్‌డ్యాన్స్, పపెట్రి, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్, క్లాసికల్ పెయింటింగ్ తదితర అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 21 నుంచి 31 వరకు క్యాంప్ కొనసాగనుంది. ఉదయం 9గంటల నుంచి 1.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోరకు రూ.2 వేలు. మరిన్ని వివరాలకు 9063357895, 8886333799లలో సంప్రదించగలరు.

సునీతమ్మకు ఒక్క అవకాశం ఇవ్వండి

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



ఫతేనగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న సునీతారెడ్డి, సర్వే సత్యనారాయణ

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లో బుధవారం మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఆమెను ఇంటింటికీ తీసుకెళ్లి ఓటర్లకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆమె హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. గత పదిహేను ఏళ్లుగా ప్రజలకు సేవ చేస్తూ రాజకీయాల్లో ఉన్న పట్నం సునీతామహేందర్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. ఆమెను గెలిపిస్తే నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు.

◆ డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ... ఆడబిడ్డగా మన ముందుకు వచ్చిన సునీతను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపాలని, మల్కాజ్‌గిరి అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పరెడ్డి, పి. నాగిరెడ్డి, రమాదేవి, కుక్కల రమేష్, రాధా, రమేష్, బోచర్, భరత్, అరుణ్, బాలకృష్ణ, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హస్తం గుర్తుకే ఓటు వేయాలి..

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా బుధవారం ప్రచారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, సీనియర్ నాయకులు కనకరాజు యాదవ్, కుంటన్న బెల్లం ఐలయ్య కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, శ్రీను, గోపాల్, మల్లేష్, నర్సింహ్మ, సమ్మయ్య, షాయిన్‌షా, అస్లాం, జ్యోతి, మోహన్, సందిప్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగు చెందారు

ప్రచారంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్





అంజయ్యనగర్‌లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు ఇస్తూ కారు గుర్తుకు ఓటు వెయ్యాలని కోరుతున్న నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్‌లో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నాయకులతో కలసి పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేస్తే అభివృద్ధి మళ్లీ మొదలు అవుతుందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన చూసి విసుగు చెంది మళ్లీ బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టేందదుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మక్కాల నర్సింగ్‌రావు, కర్రె జంగయ్య, మేకల హరినాథ్, రాజుగౌడ్, ఐలేష్, మట్టి శ్రీను, పోచయ్య, లలితా, ఉదయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌తో ముఖాముఖి..

బాలానగర్: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, లాసగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి బుధవారం కట్టమైసమ్మ ఆలయం వద్ద ఉన్న షటిల్ కోర్టులో ముఖ్యనాయకుల, వాకర్స్‌తో ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బాలాజీనగర్ డివిజన్‌లో..

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్‌లోని ఖైత్లాపూర్, సేవాలాల్‌నగర్‌లో బుధవారం మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనితా శ్రీపాద, అరుణా శెట్టి, యాదయ్య, సంతోష్, గోపాల్, కృష్ణా, కళ్యాణ్, భాగ్య, మంజుల, పుష్పమ్మ పాల్గొన్నారు.

అల్లాపూర్ డివిజన్ పరిధిలో..

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్‌లో కార్పొరేటర్ సబిహా బేగం బుధవారం రాగిడికి మద్దతుగా ప్రచారం చేశారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.



షటిల్ కోర్టులో స్థానికులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు